RNI NO.APTEL/2013/49614


**విలేకరులు కావలెను**

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా సర్క్యులేట్ కాలదుతూ ఆంధ్రప్రజలందరి మన్ననను పొందుతున్న రాజనీతి దినపత్రికకు జిల్లా వ్యాప్తంగా విలేకరులు కావలెను.

ఇతర వివరాలకు వెంటనే సంప్రదించండి:

కాకర్ల పద్మజ చీఫ్ ఎడిటర్
మొబైల్: 9618501530



శ్రీమతి కాకర్ల పద్మజ ప్రధాన సంపాదకత్వంలో

# రాజనీతి

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 13 | సంచిక : 171 | అన్నమయ్య జిల్లా | చీఫ్ ఎడిటర్ : కాకర్ల పద్మజ | గురువారం 02 జూలై 2026 | పేజీలు : 04 | వెల : రూ. 2/-


## భారత్, పాక్ మధ్య శాంతి చర్చలు పునఃప్రారంభించాలి

- మోదీ, షరీఫ్‌కు 100 మందికిపైగా ప్రముఖుల బహిరంగ లేఖ
- భారత్, పాకిస్థాన్ ప్రధానులకు 100 మందికిపైగా ప్రముఖుల విజ్ఞప్తి
- భారత్, పాక్ మధ్య శాంతి చర్చలు తిరిగి ప్రారంభించాలని లేఖ
- ఉద్రిక్తతలకు ముగింపు పలకాలని పిలుపు



వివరాలు 2లో..

## విజయ్ ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర?

- ఎమ్మెల్యేలకు రూ.35 కోట్ల ఆఫర్ ఆరోపణలు
- 15 మంది ఎమ్మెల్యేల రాజీనామాల ద్వారా ప్రభుత్వం పడగొట్టే యత్నమని ప్రచారం
- ఎమ్మెల్యేకు రూ.35 కోట్ల ఆఫర్ ఇచ్చారన్న ఆరోపణలతో ముగ్గురి అరెస్ట్
- డీఎంకే నేత సెంథిల్ బాలాజీ పేరు ప్రస్తావనకు రావడం రాజకీయంగా చర్చనీయాంశం
- ఆరోపణలను డీఎంకే ఖండిస్తూ.. ఆధారాలు ఉంటే చర్యలు తీసుకోవాలని సవాల్



వివరాలు 2లో..



## ఫ్రీడం ఆఫ్ స్పీచ్ అంటే ఫ్రీడం టు అబ్యూజ్ కాదు

- వాక్ స్వాతంత్ర్యం అభిప్రాయాలు చెప్పడానికి, ప్రభుత్వాన్ని ప్రశ్నించటానికి హక్కు ఇస్తుందన్న పవన్
- వాక్ స్వాతంత్ర్యం ఉందని ఏదైనా మాట్లాడేందుకు వీలుండదు పరిమితులున్నాయని వ్యాఖ్య
- మా నిర్ణయాలతో విభేదించే హక్కు మీకు ఉంది. దాన్ని స్వాగతిస్తాం

**అమరావతి**

యూట్యూబ్ ఛానళ్ల పేరుతో జర్నలిస్టులుగా చెప్పుకుని కొందరు, ఎనలిస్టులుగా మరికొందరు, కులమతాల సభల పేరిట ఇంకొందరు ఇటీవలి కాలంలో ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారు. వారిపై కేసులు నమోదు చేస్తే అప్రజాస్వామికం, వాక్ స్వాతంత్రం హక్కు అనే వాదనల్ని తెరపైకి తెస్తున్నారు. ఇలాంటి వారిలో ఎక్కువమంది ఉప - మిగతా3లో

# పెట్టుబడుల్లో దేశంలోనే ఏపీ నెంబర్ 1

- గూడూరులో మెగా ఫర్నిచర్ పార్క్: సీఎం చంద్రబాబు
- గొడ్డలి పార్టీ నెవర్ అగైన్, జీవితంలో ఆ పార్టీ గెలవకూడదన్న సీఎం చంద్రబాబు
- ఆడబిడ్డల జోలికి వస్తే అదే చివరి రోజు అని మరోసారి హెచ్చరించిన సీఎం
- పేదవారందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు కల్పిస్తాం
- డ్వాక్రా సంఘాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి
- ఇంటికో పారిశ్రామికవేత్త తయారు కావాలి.



**అమరావతి**

పేదలకు అండగా ఉంటూ సంక్షేమం అందిస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. పేదరిక నిర్మూలనకు అందరూ కృషి చేయాలని పీ4 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలునిచ్చారు. నెల్లూరు జిల్లా పున్నపువారిపాలెం ప్రజావేదిక సభలో చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. పేదవారందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు కల్పిస్తాం. డ్వాక్రా సంఘాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. ఇంటికో పారిశ్రామికవేత్త తయారు కావాలి. అందరికీ సంక్షేమ ఫలాలు అందాలి. అన్ని ప్రాంతాలు అభివృద్ధి కావాలి. పారిశ్రామిక అభివృద్ధిలో ఏపీ చాలా ముందుంది. దేశంలోనే మెగా ఫర్నిచర్ పార్క్ - మిగతా3లో



## సింధు నది సంక్షోభం

- పాక్ సొంత తప్పిదాలే కారణమంటున్న నివేదిక
- సింధు నదీ పరీవాహక ప్రాంతంలో నీటి సంక్షోభానికి పాక్ నిర్లక్ష్యమే కారణం
- నిర్వహణ లోపం, అవినీతితో సాగునీటి వ్యవస్థలు నిర్వీర్యం
- దేశ ఆహార భద్రత, ఆర్థిక వ్యవస్థపై పడుతున్న తీవ్ర ప్రభావం

2

## 30 రోజులు జైల్లో ఉంటే పదవి ఊడినట్టే!

- బిల్లుపై కేంద్రం కీలక నిర్ణయం
- ఈ కొత్త చట్టం ప్రకారం.. ఏదైనా తీవ్రమైన క్రిమినల్ లేదా అవినీతి కేసులో అరెస్టయి, వరుసగా 30 రోజులకు మించి జైల్లో ఉంటే పదవిని కోల్పోనున్న సదరు ప్రజాప్రతినిధి
- దేశ ప్రధాని, ముఖ్యమంత్రులు, మంత్రులతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలందరికీ వర్తించనుంది
- ఈ బిల్లును పరిశీలిస్తున్న సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఈ సమావేశాల ప్రారంభంలోనే తన నివేదికను సభకు సమర్పించనుంది

2





## భారత్‌కు వెళ్తే ఫోన్ తీసుకెళ్తా.. చైనాకు మాత్రం తీసుకెళ్లను

- భారత్‌కు వెళ్లేటప్పుడు తన ఫోన్‌ను వెంట తీసుకెళ్తానన్న అమెరికా సెనేటర్
- చైనా పర్యటనకు వెళ్తే మాత్రం ఫోన్‌ను వాషింగ్టన్‌లోనే వదిలేస్తానని వెల్లడి
- భారత్ అత్యంత నమ్మకమైన మిత్రదేశం అనడానికి ఇదే నిదర్శనమని వ్యాఖ్య

2



## ప్రజలను గందరగోళ పరచడమే జగన్ పని

- మంత్రి గొట్టిపాటి రవికుమార్
- జగన్ మావిగన్ నినాదంపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ కౌంటర్
- రాష్ట్రంపై కక్ష సాధింపు కోసమే జగన్ మావిగన్ పాట అందుకున్నారని విమర్శ
- మూడు రాజధానుల పిచ్చి సిద్ధాంతంతోనే వైసీపీకి 11 సీట్లు వచ్చాయని ఎద్దేవా
- మావిగన్ నినాదంతో సింగిల్ డిజిట్‌కు పరిమితం కావడం ఖాయమని జోస్యం
- రాజధాని విషయంలో జగన్ పూటకో మాట మాట్లాడుతున్నారని ఆరోపణ

# తాము మావిగన్‌కు కట్టుబడి ఉన్నాం

### వచ్చే ఎన్నికలు 'మావిగన్ వర్సెస్ అమరావతి'.. చూసుకుందాం

- ఏపీలో రూల్ ఆఫ్ ఫియర్ రాజ్యమేలుతోంది
- ఏపీలో ధర్మం, న్యాయం గాడి తప్పింది
- చంద్రబాబు తాను చేస్తున్న దోపిడీ, అవినీతి, దుర్మార్గపు పరిపాలనపై ప్రశ్నించే ఎవరినైనా అణచివేసే క్రమంలో దిగజారిపోతున్నారు
- ఎవరూ ఏం చేయలేరన్నట్లు ప్రవర్తిస్తున్నారు
- చంద్రబాబుని ఎవరూ ప్రశ్నించకూడదట. పశ్నిస్తే.. ఎల్లో మీడియాతో వ్యక్తిత్వ హననం చేస్తున్నారు
- మావిగన్ కు మద్దతు ఇచ్చేవారంతా వైసీపీకి ఓటు వేస్తారని వ్యాఖ్య
- ఎన్నికల మేనిఫెస్టోలో కూడా మావిగన్ ను చేరుస్తామని స్పష్టీకరణ



**తాడేపల్లి:**

తాము ఏం చేసినా ఫర్వాలేదు అనే స్థితిలో కూటమి ప్రభుత్వ పెద్దలు ఉన్నారని.. ఆ పర్యావసనమే ఇప్పుడు ఏపీలో నెలకొన్న దారుణ పరిస్థితులని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా పక్కకుపోయి రూల్ ఆఫ్ ఫియర్ రాజ్యమేలుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం తాడేపల్లిలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రెండేళ్ల కిందట.. ఏపీ పేరు చెబితే సంక్షేమం, అభివృద్ధి గురించి, విద్యా వైద్యం, వ్యవసాయం.. పరిపాలనలో విప్లవాత్మక సంస్కరణలు, మంచి - మిగతా3లో



## హజ్ యాత్రికులకు రూ.లక్ష సాయం

- మాట నిలబెట్టుకున్న చంద్రబాబు ప్రభుత్వం
- విజయవాడ నుంచి వెళ్లిన హజ్ యాత్రికులకు లక్ష రూపాయల సబ్సిడీ
- 331 మంది యాత్రికుల ఖాతాల్లోకి నేరుగా రూ. 3.31 కోట్లు జమ
- అదనపు విమాన చార్జీల భారాన్ని తగ్గించేందుకే ఈ నిర్ణయం
- ముఖ్యమంత్రి చంద్రబాబుకు మైనార్టీ వ్యవహారాల సలహాదారు కృతజ్ఞతలు
- తప్పుడు ప్రచారంపై వైసీపీ మీడియాను హెచ్చరించిన ప్రభుత్వ సలహాదారు

రాజనీతి
సమగ్ర తెలుగు దినపత్రిక
గురువారం 02 జూలై 2026

# భారత్, పాక్ మధ్య శాంతి చర్చలు పునఃప్రారంభించాలి




భారత్- పాకిస్థాన్ మధ్య దౌత్య సంబంధాల్ని పునరుద్ధరించి, ద్వైపాక్షిక చర్చల్ని తిరిగి ప్రారంభించాలని ఇరు దేశాలకు చెందిన దాదాపు 100 మందికిపైగా ప్రముఖులు సంయుక్తంగా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు భారత ప్రధాని నరేంద్ర మోదీ, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు బహిరంగ లేఖ రాశారు. దక్షిణాసియాలో శాంతి, స్థిరత్వం, అభివృద్ధి కోసం ఘర్షణలకు బదులుగా సంభాషణ, సహకార మార్గాన్ని ఎంచుకోవాలని ఇరు ప్రభుత్వాల్ని కోరారు. రెండు దేశాల మధ్య దౌత్య, వాణిజ్య, రవాణా సంబంధాల్ని మునుపటిలా సాధారణ స్థితికి తీసుకురావాలని అభ్యర్థిం చారు. జూన్ 30వ తేదీతో విడుదలైన ఈ బహిరంగ లేఖపై భారత్‌కు చెందిన 61 మంది, పాకిస్థాన్‌కు చెందిన దాదాపు 55 మంది ప్రముఖులు సంతకాలు చేశారు. సెంటర్ ఫర్ పీస్ ప్రోగ్రెస్ ఛైర్మన్ ఓపీ షా సమన్వయంతో ఈ లేఖను రూపొందించారు. ఇక ఈ లేఖపై జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రులు ఫరూక్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ, మాజీ రా - భారత గూఢచార సంస్థ) చీఫ్ ఏఎస్ దులత్, రాజ్యసభ సభ్యుడు మనోజ్ ఝా, కేంద్ర మాజీ మంత్రి మణిశంకర్ అయ్యర్, మితవాద వేర్పాటువాద నాయకుడు మిర్వైజ్ ఉమర్ ఫరూక్, పాకిస్థాన్ మాజీ విదేశాంగ శాఖ మంత్రి ఖుర్షీద్ మహ్మూద్ కసూరీ, మాజీ దౌత్యవేత్త అష్రఫ్ జహంగీర్ ఖాజీతో పాటు పలువురు మాజీ రాయబారులు, పౌర సమాజ ప్రతినిధులు సంతకాలు చేశారు.

**‘చర్చలే సమస్యల పరిష్కారానికి ఏకైక మార్గం’- లేఖలో ప్రముఖులు**

ఈ సందర్భంగా భారత్, పాక్ మధ్య విభేదాల్ని పరిష్కరించేందుకు నిరంతర ద్వైపాక్షిక చర్చలే ఏకైక మార్గమని లేఖలో వారు పేర్కొన్నారు. దక్షిణాసియాలో శాంతిని నెలకొల్పడం, పరస్పర సహకారాన్ని పునరుద్ధరించడం, సాధారణ పరిస్థితులకు తీసుకొచ్చేందుకు రెండు దేశాల ప్రభుత్వాలు అర్థవంతమైన, దీర్ఘకాలిక చర్యలు చేపట్టాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. ఇదే సమయంలో రెండు దేశాల మధ్య పూర్తి స్థాయిలో దౌత్య సంబంధాల్ని పునరుద్ధరించాలని, హైకమిషనర్లను తిరిగి నియమించాలని, సాధారణ వీసా సేవల్ని కూడా పునఃప్రారంభించాలని లేఖలో సూచించారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న అన్ని ద్వైపాక్షిక అంశాలపై సమగ్ర చర్చలు ప్రారంభించాలని కోరారు.

**‘సైనిక ఉద్రిక్తతలు తగ్గించేలా చర్యలు చేపట్టాలి’**

జమ్మూకశ్మీర్‌కు సంబంధించిన అన్ని అంశాలపైనా చర్చలు కొనసాగించాలని ఆ ప్రముఖులు లేఖలో పేర్కొన్నారు. 2004 నుంచి 2007 వరకు ఇరు దేశాలు చర్చించిన అంశాల్ని మరోసారి పరిశీలించాలని సూచించారు. ఇరు దేశాల భద్రతా ఆందోళనలను దృష్టిలో పెట్టుకొని సైనిక ఉద్రిక్తతల్ని తగ్గించే చర్యలు చేపట్టాలని కోరారు. లేఖలో పేర్కొన్న ఇతర అంశాలు చూస్తే- ‘భారత్ పాకిస్థాన్ మధ్య వాణిజ్య సంబంధాలు తిరిగి ప్రారంభించాలి. అట్టారీ వాఘా సరిహద్దు వాణిజ్య మార్గాన్ని తిరిగి తెరవాలి. దిల్లీ- లాహోర్ బస్సు సర్వీస్, శ్రీనగర్- ముజఫరాబాద్ బస్సు సర్వీస్, సంఝౌతా ఎక్స్‌ప్రెస్, థార్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవల్ని పునరుద్ధరించాలి. కార్గిల్ స్కార్దూ మార్గాన్ని తెరవాలి. కమర్షియల్ ఫ్లైట్స్ తిరిగేందుకు వీలుగా ఇరు దేశాలు గగనతలాల్ని మళ్లీ అందుబాటులోకి తీసుకురావాలి’ అని విజ్ఞప్తి చేశారు.

**200 కోట్ల మంది సంక్షేమం, ఆశయాల కోసమే**

ఇదే సమయంలో కర్తార్‌పుర్ సాహిబ్ కారిడార్‌ను పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలని, శారదా పీఠాన్ని యాత్రికుల కోసం తెరవాలని లేఖలో సూచించారు. ‘దక్షిణాసియా భవిష్యత్తు- విభేదాలు, ఘర్షణలతో కాకుండా శాంతి, అభివృద్ధి, పరస్పర సహకారంతో ముందుకు సాగాలి’ అని పేర్కొన్నారు. చివరగా ఇది ఏ రాజకీయ వైఖరికి మద్దతుగా రాసిన లేఖ కాదని, దాదాపు 200 కోట్ల మంది ప్రజల సంక్షేమం, ఆశయాల్ని దృష్టిలో పెట్టుకొని చేసిన విజ్ఞప్తి మాత్రమేనని స్పష్టం చేశారు. భారత్- పాకిస్థాన్ జనాభాలో అధిక శాతం యువతేనని, ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల లక్షలాది మంది యువత ఉపాధి, విద్య, వ్యాపారం, అభివృద్ధి అవకాశాల్ని కోల్పోతున్నారని పేర్కొన్నారు. అందుకే ఘర్షణకు బదులుగా సహకారం, శత్రుత్వానికి బదులు సంభాషణ, ఒంటరితనానికి బదులుగా పరస్పర భాగస్వామ్యాన్ని ఎంచుకోవాలని ఇరు ప్రభుత్వాల్ని కోరారు.

# 30 రోజులు జైల్లో ఉంటే పదవి ఊడినట్టే!



**ఢిల్లీ:** రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ఒక కీలక బిల్లును తీసుకురానుంది. అదే 130వ రాజ్యాంగ సవరణ బిల్లు. ఈ కొత్త చట్టం ప్రకారం.. ఏదైనా తీవ్రమైన క్రిమినల్ లేదా అవినీతి కేసులో అరెస్టయి, వరుసగా 30 రోజులకు మించి జైల్లో ఉంటే సదరు ప్రజాప్రతినిధి తన పదవిని కోల్పోతారు. రాజకీయాల్లో అవినీతిని అరికట్టేందుకు తెస్తున్న ఈ చట్టం.. దేశ ప్రధాని, ముఖ్యమంత్రులు, మంత్రులతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలందరికీ వర్తిస్తుంది. ఈ బిల్లును పరిశీలిస్తున్న సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఈ సమావేశాల ప్రారంభంలోనే తన నివేదికను సభకు సమర్పించనుంది. జేపీసీ నివేదికను పరిశీలించిన తర్వాత, ఈ బిల్లును ఆమోదం కోసం ప్రభుత్వం పార్లమెంట్ ముందుకు తెస్తుంది. రాజ్యాంగ సవరణ బిల్లు కావడంతో, ఇది చట్టంగా మారాలంటే పార్లమెంట్‌లోని ఉభయ సభల్లో మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం అవుతుంది పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జూలై 21 నుంచి ప్రారంభమై ఆగస్టు 21 వరకు జరగనున్నాయి.కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ సమావేశాలకు సంబంధించిన ప్రతిపాదనకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కారణంగా ఆగస్టు 13, 14 తేదీల్లో సభకు సెలవు ఉంటుంది. 130వ రాజ్యాంగ సవరణ బిల్లుతో పాటు పలు కీలక బిల్లులు ఈ సమావేశాల్లోనే చర్చకు రానున్నాయి.

# భర్త కంటే ఎక్కువ సంపాదిస్తున్న భార్యకు ‘తాత్కాలిక భరణం’ పొందే హక్కు లేదు

**‘భార్య ఆర్థికంగా స్థిరపడితే తాత్కాలిక భరణం ఇవ్వక్కర్లేదు’**
**కర్ణాటక హైకోర్టు కీలక తీర్పు**




ఓ భార్యాభర్తల వివాదం కేసు విషయంలో కర్ణాటక హైకోర్టు మంగళవారం కీలక తీర్పు ఇచ్చింది. ఆర్థికంగా స్వతంత్రంగా ఉంటూ, భర్త కంటే ఎక్కువ సంపాదిస్తున్న భార్యకు ‘తాత్కాలిక భరణం’ పొందే హక్కు లేదని స్పష్టం చేసింది. భార్యకు నెలకు రూ.20వేలు తాత్కాలిక భరణం చెల్లించాలంటూ దిగువ కోర్టు ఇచ్చిన ఆదేశాలను కర్ణాటక హైకోర్టు రద్దు చేసింది. కర్ణాటకకు చెందిన ఇద్దరు వ్యక్తులకు 2024లో వివాహం అయ్యింది. కానీ వైవాహిక విభేదాల కారణంగా కొన్ని నెలల తర్వాత విడివిడిగా జీవించడం ప్రారంభించారు. ఆ తర్వాత భార్య భరణం కోరుతూ దిగువ కోర్టును ఆశ్రయించింది. విచారణ సమయంలో, భర్త నెలవారీ జీతం రూ.60,646కాగా, భార్య నెలకు రూ.1 లక్ష సంపాదిస్తున్నట్లు తేలింది. అయినప్పటికీ భర్త ప్రతి నెలా రూ.20వేలు తాత్కాలిక భరణం చెల్లించాలని దిగువ కోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాన్ని సవాల్? చేస్తూ భర్త కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. ఆయన దాఖలు చేసిన పిటిషన్?ను జస్టిస్? చిల్లాకూర్? సుమలత అనుమతించారు. ఈ కేసు విచారణ సందర్భంగా హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భర్త ఎల్లప్పుడూ భార్యకు ఆర్థికంగా మద్దతు ఇవ్వాలనే లింగ-ఆధారిత అంచనాలు ఆధారంగా తీర్పులు ఇవ్వకూడదని స్పష్టం చేసింది. ముఖ్యంగా భార్య ఆర్థికంగా సురక్షితంగా ఉండి, ఎలాంటి సాయం అవసరం లేనప్పుడు తాత్కాలిక భరణం ఇవ్వాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఇలాంటి ప్రతి కేసుకు సంబంధించి పూర్తి వాస్తవాలు, పరిస్థితులను నిశితంగా పరిశీలించిన తర్వాతే భరణంకు సంబంధించిన ఆదేశాలు జారీ చేయాలని హైకోర్టు తేల్చిచెప్పింది. భార్య ఆర్థికంగా స్వతంత్రంగా ఉండి, భర్త కంటే ఎక్కువ సంపాదిస్తూ, పిల్లల సంరక్షణ లాంటి అదనపు బాధ్యతలు లేనప్పుడు భరణం ఇవ్వాల్సిన అవసరం ఏముంది? భార్యను పోషించడం భర్త బాధ్యత అనే భావనతో మాత్రమే భరణం చెల్లించాలని కోర్టులు ఆదేశించకూడదని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. భర్త ఎల్లప్పుడూ భార్యను పోషించాలనే సంప్రదాయ భావనలకు లోనుకావద్దని ఫ్యామిలీ కోర్టుకు సూచించింది. భార్య- తనను తాను పోషించుకోవడానికి అవకాశం లేదని, స్వతంత్ర ఆర్థిక వనరులు లేవని నిరూపించుకున్నప్పుడు మాత్రమే తాత్కాలిక భరణాన్ని లేదా తుది భరణాన్ని మంజూరు చేయాలని హైకోర్టు పేర్కొంది.

“ప్రస్తుత కేసులో భార్య నెలవారీ ఆదాయం ఒక లక్ష రూపాయలు. అది ఆమే స్వయంగా అంగీకరించింది. ఇది ఆమె భర్త నెలవారీ జీతం కంటే ఎక్కువ. దీనిని బట్టి భార్య ఆర్థికంగా స్వతంత్రంగా ఉంది. కాబట్టి తనను తాను పోషించుకోగలదు. నెలకు సుమారు రూ.60వేలు జీతం వచ్చే భర్తను, ప్రతినెలా రూ.20వేలు తాత్కాలిక భరణం చెల్లించాలని దిగువ కోర్టు ఆదేశించడం సరికాదు. అలాంటి ఆదేశం చట్టబద్ధంగా చెల్లదు” అని హైకోర్టు పేర్కొంది. అయితే ఈ తీర్పు కేవలం ‘తాత్కాలిక భరణం’ అంశానికి మాత్రమే పరిమితమని, పెళ్లి వివాదానికి సంబంధించిన తుది తీర్పుపైగానీ, భరణంపై తీసుకునే తుది నిర్ణయంపై గానీ దీని ప్రభావం ఉండదని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. కాగా ఈ కేసులో, భార్య ఆర్థికంగా స్వయంసమృద్ధిగా ఉంది, పైగా భర్త కంటే చాలా ఎక్కువ సంపాదిస్తున్నది కాబట్టి, తాత్కాలిక భరణాన్ని మంజూరు చేయలేమని పేర్కొంటూ దిగువ కోర్టు ఆదేశాలను హైకోర్టు రద్దు చేసింది.

నోట్: ఇంటరిమ్ మెయింటెనెన్స్ అంటే మధ్యంతర భరణం లేదా తాత్కాలిక నిర్వహణ ఖర్చు అని అర్థం. విడాకులు లేదా భరణం కేసు కోర్టులో నడుస్తున్నప్పుడు, ఈ కేసు పూర్తిగా ముగిసేలోపు ఆర్థికంగా వెనుకబడిన జీవిత భాగస్వామికి కోర్టు మంజూరు చేసే తాత్కాలిక ఆర్థిక సాయాన్ని ఇంటరిమ్ మెయింటెనెన్స్? అంటారు.

## సింధు నది సంక్షోభం



పాకిస్థాన్‌లోని సింధు నదీ పరీవాహక ప్రాంతంలో నెలకొన్న తీవ్ర నీటి సంక్షోభానికి బాహ్య కారణాల కంటే దేశీయంగా ఉన్న నిర్లక్ష్యం, అసమర్థ నిర్వహణ, మౌలిక సదుపాయాల వైఫల్యాలే ప్రధాన కారణమని తాజా విశ్లేషణలు స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద సాగునీటి వ్యవస్థల్లో ఒకటైన సింధు బేసిన్, పాకిస్థాన్ ఆహార భద్రతకు, ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటిది. అయితే, పాలకుల ఉదాసీనత వల్ల ఈ కీలక వ్యవస్థ ప్రస్తుతం పెను ప్రమాదంలో పడింది. దశాబ్దాలుగా సాగునీటి కాలువల నిర్వహణను విస్మరించడం, అవినీతి, ప్రావిన్సుల మధ్య నీటి పంపకాల వివాదాలు ఈ సమస్యను మరింత జఠిలం చేశాయి. అనేక కాలువలకు లైనింగ్ లేకపోవడంతో భారీ స్థాయిలో నీరు వృథా అవుతోంది. మరోవైపు, భూగర్భ జలాల మితిమీరిన వినియోగం, భూములు చౌడుబారడం వంటి సమస్యలు వ్యవసాయ రంగాన్ని కుదేలు చేస్తున్నాయి. పటిష్టమైన జాతీయ జల విధానం లేకపోవడం కూడా ఈ దుస్థితికి ప్రధాన కారణంగా మారింది. ఈ నీటి సంక్షోభం రైతులు, మత్స్యకారుల జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సింధు డెల్టా ప్రాంతంలోకి సముద్రపు నీరు చొచ్చుకురావడంతో సాగు భూములు నిస్సారంగా మారాయి. ఫలితంగా, గత కొన్నేళ్లలో లక్షలాది మంది జీవనోపాధిని కోల్పోయి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం హిందూకుష్-హిమాలయ ప్రాంతంలో హిమపాతం తగ్గడం వల్ల నదుల్లో ప్రవాహాలు క్షీణించాయి. అయినప్పటికీ, నీటి వృథాను అరికట్టి, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు వాతావరణానికి అనువైన పంటలను సాగు చేయడం ద్వారా ఈ సంక్షోభం నుంచి గట్టెక్కవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## భారత్‌కు వెళ్తే ఫోన్ తీసుకెళ్తా.. చైనాకు మాత్రం తీసుకెళ్లను



అమెరికాకు భారత్ అత్యంత విశ్వసనీయ మిత్రదేశమని, కీలక వ్యూహాత్మక భాగస్వామి అని రిపబ్లికన్ సెనేటర్ స్టీవ్ డైన్స్ పేర్కొన్నారు. చైనాతో పోలిస్తే భారత్‌పై తమకు ఎంతటి నమ్మకం ఉందో వివరించేందుకు ఆయన తన వ్యక్తిగత ఫోన్‌ను ఉదాహరణగా చూపారు. తాను భారత్ పర్యటనకు వెళ్లేటప్పుడు వ్యక్తిగత ఫోన్‌ను వెంట తీసుకెళ్తానని, అదే చైనా పర్యటనకు వెళ్తే మాత్రం భద్రతా కారణాల దృష్ట్యా దానిని వాషింగ్టన్‌లోనే వదిలి వెళ్తానని ఆయన వెల్లడించారు. యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్ సదస్సులో ఆయన మాట్లాడుతూ, “నేను చైనాకు వెళ్లేటప్పుడు నా ఫోన్ బీజింగ్‌కు తీసుకువెళ్లను. అది వాషింగ్టన్ డీసీలోని నా డెస్క్‌పైనే ఉంటుంది. కానీ నేను ఢిల్లీకి గానీ, భారత్‌లోని మరే ఇతర ప్రాంతానికి గానీ వెళ్లేటప్పుడు నా ఫోన్ ఎప్పుడూ నాతోనే ఉంటుంది. భారత్ అత్యంత విశ్వసనీయమైన మిత్రదేశం అనడానికి ఇదే నిదర్శనం” అని స్పష్టం చేశారు. చైనాతో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా వ్యూహాత్మక ఆలోచనా సరళికి సెనేటర్ వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయి. బీజింగ్‌తో సంబంధాలు ముఖ్యమైనవే అయినప్పటికీ, భారత్‌తో పటిష్టమైన బంధం అత్యంత ఆవశ్యకమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా, అత్యంత కీలక భాగస్వామిగా భారత్ పోషిస్తున్న పాత్రను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు.

## విజయ్ ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర?



తమిళనాడులో ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర జరిగిందంటూ సంచలన ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఈ కుట్రను రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం భగ్నం చేసిందని, ఈ కేసులో ఇప్పటికే ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎన్‌డీటీవీ తన కథనంలో పేర్కొంది. ఎన్‌డీటీవీ కథనం ప్రకారం.. విజయ్ పార్టీకి చెందిన ఉతంగరై ఎమ్మెల్యే ఎస్. ఎలైయరాజా ఇచ్చిన ఫిర్యాదుతో ఈ వ్యవహారం బయటపడింది. అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌పై అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వాలని, అందుకు రూ.35 కోట్లు ఇస్తామని ఓ కన్సల్టెన్సీ సంస్థ ప్రతినిధి తనను సంప్రదించాడని ఎమ్మెల్యే ఆరోపించారు. ఈ విషయాన్ని బయటకు చెబితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని బెదిరించినట్లు కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు తొలుత చెన్నైలో ఒకరిని, అనంతరం కరూర్‌లో మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. దర్యాప్తులో ఈ వ్యవహారానికి డీఎంకే ఎమ్మెల్యే సెంథిల్ బాలాజీతో సంబంధాలున్నట్లు గుర్తించినట్లు ఎన్‌డీటీవీ పేర్కొంది. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు. ఈ ఘటనపై స్పందించిన తమిళనాడు మంత్రి సీటీ నిర్మల్ కుమార్.. సెంథిల్ బాలాజీకి సన్నిహితులే ఈ కుట్రలో ఉన్నారని ఆరోపించారు. విజయ్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు పలువురు ఎమ్మెల్యేలకు రూ.10 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు ఆఫర్లు ఇచ్చారని కూడా ఆయన ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలను డీఎంకే ఖండించింది. దర్యాప్తు వివరాలను లీక్ చేసి ప్రజల్లో తప్పుడు ప్రచారం సృష్టించే ప్రయత్నం జరుగుతోందని డీఎంకే అధికార ప్రతినిధి ఏ. శరవణన్ విమర్శించారు. తమ వద్ద ఆధారాలు ఉంటే సెంథిల్ బాలాజీని అరెస్ట్ చేయాలని సవాల్ విసిరారు.

## పాపాఘ్ని నదిపై నిర్మిస్తున్న హై లెవెల్ బ్రిడ్జి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్.



పీటీఎం, జూలై 1 (రాజనీతి ప్రతినిధి): అన్నమయ్య జిల్లాలో రహదారి మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా ఆర్ అండ్ బి శాఖ చేపడుతున్న పనులను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పీటీఎం మండలంలోని బూర్లపల్లి--టీ. సదుం--చెన్నారాయునిపల్లె రహదారిపై కిలోమీటర్ 16/8--10 వద్ద పాపాఘ్ని నదిపై నిర్మిస్తున్న హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పురోగతిని కలెక్టర్ పరిశీలించి అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బూర్లపల్లి--టీ. సదుం--చెన్నారాయునిపల్లె రహదారిని కిలోమీటర్ 0/000 నుంచి 18/300 వరకు అభివృద్ధి చేసే పనుల్లో భాగంగా ఈ వంతెనను నిర్మిస్తున్నట్లు ఆర్ అండ్ బి అధికారులు వివరించారు. ఈ హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం సుమారు రూ.10 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు. వంతెన పూర్తయిన అనంతరం ఈ ప్రాంత ప్రజలకు ఏడాది పొడవునా సురక్షితమైన రాకపోకలు అందుబాటులోకి రావడంతో పాటు వర్షాకాలంలో ఏర్పడే రవాణా ఇబ్బందులు గణనీయంగా తగ్గనున్నాయని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలు, సాంకేతిక ప్రమాణాలు, భద్రతా మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించి ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.నిర్మాణంలో వినియోగించే సామగ్రి నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షించాలని, ప్రతి దశలో సాంకేతిక నిపుణుల సూచనలను పాటించాలని అధికారులకు సూచించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉ ంచుకుని పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు.డిసెంబర్--2026 నాటికి హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రహదారి అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలకు మెరుగైన, సురక్షితమైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అనంతరం బి.కొత్తకోట--వయా రంగసముద్రం రహదారిపై చేపడుతున్న సి.సి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. మొత్తం రూ.5.80 కోట్ల వ్యయంతో చేపడుతున్న పనుల్లో భాగంగా సుమారు 300 మీటర్ల మేర ఒక వైపు సి.సి రోడ్డు నిర్మాణం పూర్తై ప్రస్తుతం క్యూరింగ్ పనులు కొనసాగుతున్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల పురోగతి, నాణ్యతను పరిశీలించిన కలెక్టర్, నిర్ణీత గడువులోగా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను పూర్తి చేయాలని అధికారులకు తగు సూచనలు, సలహాలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి శాఖ అధికారులు, ఇంజినీర్లు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## వీవీపిల పర్యటన: 900 మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు -- ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు



తిరుపతి జిల్లా జూలై 1 (రాజనీతి ప్రతినిధి):: జూలై 2న రైల్వే కోడూరు నియోజకవర్గం, ఓబులపల్లి మండలం ముక్కావారిపల్లి సమీపంలో నిర్వహించనున్న జీ-రామ్ (+--=ూవీ) కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ మరియు కేంద్ర, రాష్ట్ర మంత్రులు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు (ఖూా) సభా ప్రాంగణాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జాతీయ స్థాయి ప్రాధాన్యత కలిగిన ఈ కార్యక్రమం కోసం సుమారు 900 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీఐపీల భద్రత, రూట్ బందోబస్తు, హెలిప్యాడ్, పార్కింగ్ మరియు క్రౌడ్ మేనేజ్‌మెంట్‌పై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మఫ్టీ పోలీసులను మోహరించారు. చిట్వేలు, రైల్వే కోడూరు వైపు నుంచి వచ్చే భారీ వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లిస్తూ ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళికను అమలు చేస్తున్నారు. సభకు వచ్చే ప్రజల వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలు కేటాయించారు. అలాగే తాగునీరు, మార్గదర్శక సూచికల వంటి సౌకర్యాలను కల్పిస్తున్నారు. ఈ పర్యటనను విజయవంతం చేయడానికి ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ సమీక్షలో రెడ్ శాండర్స్ టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీ శ్రీనివాస్ (ఖూా), అదనపు ఎస్పీలు శ్రీ శ్రీనివాసులు, శ్రీ కులశేఖర్, ఎస్బీ డీఎస్పీ గీతా కుమారి మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలకు 70 ఇండక్షన్ స్టవ్‌ల పంపిణీ.



కె.వి.పల్లి, జూలై 1 (రాజనీతి ప్రతినిధి): కె.వి.పల్లి మండలం సొరకాయలపేట గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి, చిన్నారులు మరియు గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు 70 ఇండక్షన్ స్టవ్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్వైజర్ స్వర్ణ చేతుల మీదుగా అంగన్‌వాడీ టీచర్లకు స్టవ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి సూపర్వైజర్ స్వర్ణ మరియు మండల అధ్యక్షురాలు గీతాంజలి సంయుక్తంగా మాట్లాడిన వారు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం తయారీలో ఆధునిక సౌకర్యాలు కల్పించడం ద్వారా వంట ప్రక్రియ మరింత వేగంగా, పరిశుభ్రంగా, సురక్షితంగా నిర్వహించే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. ఇండక్షన్ స్టవ్‌ల వినియోగంతో గ్యాస్, కట్టెలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గడంతో పాటు సమయం ఆదా కావడంతో అంగన్‌వాడీ సిబ్బందికి కూడా పనిభారం కొంత మేర తగ్గుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి చేపడుతున్న చర్యల్లో భాగంగానే ఈ పంపిణీ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఈ స్టవ్‌ల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పోషకాహారాన్ని మరింత పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేసి అందించేందుకు అవకాశం కలుగుతుందని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా సేవల నాణ్యత మరింత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గీతాంజలి, గోరంట్లపల్లి మాజీ సర్పంచ్ కృష్ణయ్య, అంగన్‌వాడీ సూపర్వైజర్ స్వర్ణ, జయన్న, అంగన్‌వాడీ టీచర్లు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పంపిణీ అనంతరం అంగన్‌వాడీ టీచర్లు ఈ సౌకర్యం కల్పించినందుకు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు పంపిణీ చేసిన మార్కెట్ యార్డు చైర్మన్ పురం రామమూర్తి



పీలేరు జూలై 1 (రాజనీతి ప్రతినిధి): పీలేరు పట్టణంలోని బండ్లవంక, ట్రెజరీ వీధి, రాములవారి గుడి, సిల్వర్ లాడ్జి, సాయిబాబా స్కూల్ తదితర ప్రాంతాల్లో బుధవారం 'ఎన్టీఆర్ భరోసా' పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. పీలేరు మార్కెట్ యార్డు చైర్మన్ పురం రామమూర్తి ఈ కార్యక్రమంలో పాల్గొని, లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి స్వయంగా పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా పురం రామమూర్తి మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఒకటో తేదీనే, నేరుగా ఇంటి వద్దే పెన్షన్ అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఎమ్మెల్యే శ్రీ నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి గారి సూచనల మేరకు ఉ దయాన్నే ఈ పంపిణీ కార్యక్రమం చేపట్టామని చెప్పారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ?4 వేల నుండి ?15 వేల వరకు పెన్షన్ అందుతోందని, ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు ఇంటి వద్దే పెన్షన్ అందుకున్న లబ్ధిదారులు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది రాధిక, జీవిత, మోసిన్, టీడీపీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేణిగుంట విమానాశ్రయంలో మంత్రి నారా లోకేష్‌కు ఘన స్వాగతం



రేణిగుంట జూలై 1 (రాజనీతి ప్రతినిధి): రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్‌కు రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు ఘన స్వాగతం పలికారు. పుట్టపర్తి నుంచి ప్రత్యేక విమానంలో మంగళవారం సాయంత్రం రేణిగుంట చేరుకున్న మంత్రికి ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఆత్మీయంగా ఆహ్వానించారు. విమానాశ్రయం వెలుపల పెద్ద సంఖ్యలో తరలివచ్చిన పార్టీ శ్రేణులు నినాదాలతో సందడి చేశారు. అనంతరం, అక్కడ నుంచి భారీ బైక్ ర్యాలీ నడుమ మంత్రి నారా లోకేష్ శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యకర్తల సమావేశం జరిగే సభా ప్రాంగణానికి బయలుదేరి వెళ్లారు. మార్గమధ్యంలో పార్టీ అభిమానులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

## గాయపడిన టీడీపీ కార్యకర్తను పరామర్శించిన ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి



కలికిరి జూలై 1 (రాజనీతి ప్రతినిధి): ఇటీవల జరిగిన ఒక ప్రమాదంలో గాయపడిన కలికిరి మండలం గుట్టపాలెం గ్రామం యల్లంపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త మల్లికార్జున గౌడ్‌ను పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి బుధవారం ఆయన నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా మల్లికార్జున గౌడ్‌ను ఆప్యాయంగా పలకరించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని, ప్రమాద వివరాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. మల్లికార్జున గౌడ్ పార్టీకి అంకితభావంతో పనిచేసిన నిబద్ధత గల కార్యకర్త అని కొనియాడారు. కార్యకర్తలు పార్టీకి కుటుంబ సభ్యులతో సమానమని, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం తన బాధ్యతని పేర్కొన్నారు. వైద్యానికి ఎలాంటి సహాయం కావాలన్నా, మెరుగైన చికిత్స కోసం అవసరమైతే ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు చేసి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ధైర్యంగా ఉండి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్థానిక టీడీపీ నాయకులు, గ్రామస్తులు, కార్యకర్తలు మరియు నల్లారి అభిమానులు పాల్గొన్నారు.

## బాల కార్మికత్వాన్ని నిర్మూలిద్దాం.. నవ సమాజానికి నాంది పలుకుదాం: పీలేరులో ముగిసిన కార్యాచరణ మాసం




పీలేరు జూలై 1 (రాజనీతి ప్రతినిధి): "ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం" సందర్భంగా జూన్ 1 నుండి 30 వరకు నిర్వహించిన బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక కార్యాచరణ మాసం ముగింపు కార్యక్రమం పీలేరు మండలంలో మంగళవారం (జూన్ 30, 2026) ఘనంగా జరిగింది. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా కార్మిక, విద్య, పోలీసు, లీగల్ సర్వీసెస్, శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో పీలేరులోని పాత బస్టాండు, కోర్టు ఆవరణ, మరియు సదుం రోడ్డులోని పలు దుకాణాలు, హోటళ్లు, మెకానిక్ షెడ్లలో అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రతి చిన్నారికి విద్యా హక్కు, సువర్ణ భవిష్యత్తు పొందే హక్కు ఉన్నాయని, బాలలను పనుల్లో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ వ్యాపారస్తులకు, స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ తనిఖీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ లేబర్ ఆఫీసర్ జగదీష్, గ్రేట్ విజన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జి.వి.సుబ్రహ్మణ్యం బాబు, పీలేరు పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ హేమసుందర్ జెట్టి, మండల్ లీగల్ సర్వీస్ అథారిటీ ప్రతినిధి గట్టప్ప, మండల విద్యాశాఖ సీఆర్పీలు మురళీధర్, మాధవి, తాజూన్, లేబర్ డిపార్ట్మెంట్ జూనియర్ అసిస్టెంట్ మునిదినేష్, మరియు స్థానిక వ్యాపారస్తులు పాల్గొన్నారు.

# కలికిరిలో ఘనంగా ఉచిత వైద్య శిబిరం: సహకార వారోత్సవాల్లో చైర్మన్ నల్లారి చంద్రకుమార్ రెడ్డి



కలికిరి జూలై 1 (రాజనీతి ప్రతినిధి): సహకార వారోత్సవాల్లో భాగంగా బుధవారం (01/07/2026) కలికిరి మండలం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సహకార బ్యాంకు చైర్మన్ గౌరవనీయులు శ్రీ నల్లారి చంద్ర కుమార్ రెడ్డి గారి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ శిబిరంలో మండల ప్రజలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సహకార బ్యాంకు డైరెక్టర్లు అల్లాబక్షు, సుబ్బయ్య, సీఈఓ కొండప్ప, జేఐ దీప, గౌస్, నాయకులు సిబ్బాల దినకర్, వెంకటనారాయణ రెడ్డి, రాజా రెడ్డి, రమణ పాల్గొన్నారు. అలాగే వైద్య సిబ్బంది డాక్టర్ కావ్య గంధ, సూపర్ వైజర్ సుధీకర్, సీహెచ్ఓ పావని, షరీఫా, ఎంపీహెచ్ఏ నఫీజా, ఆశా వర్కర్లు లక్ష్మిదేవి, నాగవేణి తదితరులు పాల్గొని సేవలందించారు.

# ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి



కలికిరి జూలై 1 (రాజనీతి ప్రతినిధి): పీలేరు నియోజకవర్గం కలికిరి మండలం గుట్టపాలెం గ్రామం కస్పాలో బుధవారం ఉదయం 6 గంటల నుంచే 'ఎన్టీఆర్ భరోసా' పెన్షన్ల పంపిణీ పండుగలా సాగింది. పీలేరు శాసనసభ్యులు శ్రీ నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి స్వయంగా పాల్గొని, లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికే ప్రథమ ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఒకటో తేదీ ఉదయాన్నే ఎలాంటి మధ్యవర్తులు, కోతలు లేకుండా నేరుగా లబ్ధిదారుల చేతికే పెన్షన్ అందిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో పెన్షన్ల కోసం అవ్వాతాతలు పడిన కష్టాలకు స్వస్తి పలికి, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ?4 వేల నుండి ?15 వేల వరకు అందిస్తూ వారి ఆత్మగౌరవాన్ని కాపాడుతున్నామని పేర్కొన్నారు. అనంతరం లబ్ధిదారులతో ఆయన ఆప్యాయంగా మాట్లాడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు మరియు నల్లారి అభిమానులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యం వద్దు.. నిండు ప్రాణమే ముద్దు: అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



మదనపల్లి జూలై 1 (రాజనీతి ప్రతినిధి):: మానవ జీవితం ఎంతో అమూల్యమైనదని, చిన్నపాటి నిర్లక్ష్యంతో ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని అన్నమయ్య జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి (ఐపీఎస్) ప్రజలను కోరారు. బుధవారం (01/07/2026) ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, చట్టాలను గౌరవిస్తూ సురక్షిత అన్నమయ్య జిల్లా సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలి. మద్యం సేవించి వాహనాలు నడిపినా, మైనర్లకు వాహనాలు ఇచ్చినా కఠిన చర్యలు తప్పవు. స్మార్ట్‌ఫోన్ ద్వారా పొంచి ఉన్న సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి. అపరిచిత లింకులు క్లిక్ చేయవద్దు, ఓటీపీలు ఎవరికీ చెప్పకూడదు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే వెంటనే '1930' నెంబర్‌కు కాల్ చేయాలి. యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. జిల్లాలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే '1098' నెంబర్‌కు, మహిళలు ఆపదలో ఉంటే తక్షణ సహాయం కోసం '112' నెంబర్‌కు డయల్ చేసి పోలీసు సేవలను వినియోగించుకోవాలని ఎస్పీ స్పష్టం చేశారు.

# డాక్టర్స్ డే సందర్భంగా కలికిరిలో ఘనంగా హెల్తీ 5కే రన్ నిర్వహణ




కలికిరి, జూలై 1 (రాజనీతి ప్రతినిధి): డాక్టర్స్ డే సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్, పీలేరు మరియు కపిలేశ్వర హాస్పిటల్స్, కలికిరి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 6.00 గంటలకు కలికిరి క్రాస్ రోడ్స్ నుండి నిర్వహించిన హెల్తీ 5కే రన్ కార్యక్రమం ఘన విజయాన్ని సాధించింది. ఈ కార్యక్రమంలో సుమారు 250 మంది వైద్యులు, దంత వైద్యులు, వైద్య విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది మరియు ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన వారందరికీ ప్రారంభ స్థలంలో నిర్వాహకులు రిజిస్ట్రేషన్ నిర్వహించి, రన్నింగ్ నంబర్లను అందజేశారు. అనంతరం కలికిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అనిల్ పాల్గొన్న వారికి రోడ్డు భద్రతా నియమాలు, రన్ సందర్భంగా పాటించాల్సిన సూచనలను వివరించి, నిర్వాహకులతో కలిసి పచ్చజెండా ఊపి 5ఖ రన్‌ను ప్రారంభించారు. రన్ ప్రారంభమైన తర్వాత ముందుగా పోలీస్ ప్యాట్రోల్ వాహనం భద్రత కల్పించగా, చివరగా అంబులెన్స్ ఫాలో అవుతూ అత్యవసర వైద్య సేవలను అందించేందుకు సిద్ధంగా ఉండింది. అలాగే ప్రతి 500 మీటర్లకు హైడ్రేషన్ పాయింట్లు ఏర్పాటు చేసి, తాగునీరు మరియు గ్లూకోజ్–డి కలిపిన నీరు అందుబాటులో ఉంచడం ద్వారా పాల్గొన్న వారందరికీ అవసరమైన సౌకర్యాలు కల్పించారు. రన్ ముగిసిన అనంతరం కపిలేశ్వర హాస్పిటల్ ప్రాంగణంలో విజేతలకు మెడల్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న బ్రిగేడియర్ అనుపమ్ శర్మ, **DIG, CIAT-03, CRPF,** కలికిరి మాట్లాడుతూ వైద్యులందరికీ డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేసి, సమాజ ఆరోగ్య పరిరక్షణలో వైద్యుల సేవలు అమూల్యమైనవని కొనియాడారు. సైనిక్ స్కూల్ ఫస్ట్ లేడీ శ్రీమతి కమలాజిత్ కౌర్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే వైద్యులు కూడా తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కలికిరి మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి గులాబ్ జాన్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. **IMA** పీలేరు అధ్యక్షులు డా. ఆర్. రాజాసాహెబ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన కపిలేశ్వర హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డా. శివప్రసాద్ సి.వి., సహకరించిన ప్రభుత్వ ఆసుపత్రి కలికిరి వైద్యాధికారి డా. వై. పవన్ కుమార్, అలాగే కార్యక్రమ విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. జిల్లా ఎన్టీఆర్ వైద్య సేవా కోఆర్డినేటర్ డా. కె. లోకవర్ధన్ మాట్లాడుతూ సమాజ ఆరోగ్యానికి ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. పీలేరు ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా. పి. చంద్రశేఖర్ పర్యవేక్షణలో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ×మీూ పీలేరు అధ్యక్షులు డా. ఆర్. రాజాసాహెబ్ మరియు కార్యదర్శి డా. చంద్రశేఖర్ నాయక్ నాయకత్వంలో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడినందుకు వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కపిలేశ్వర హాస్పిటల్స్‌కు చెందిన డా. శివప్రసాద్ సి.వి., డా. ఆర్. ఎం. హిమబిందు, **SPS** హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా. షేక్ మహమ్మద్ వసీమ్, డా. షేక్ సిమ్రాన్, డా. శివయోగి సోమశేఖర్, **IDA** పీలేరు తరఫున డా. పి. రామమోహన్ రెడ్డి మరియు **IDA** సభ్యులు, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు చెందిన వైద్యులు, దంత వైద్యులు, వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. "మన ఆరోగ్యం –– మన బాధ్యత" అనే సందేశంతో నిర్వహించిన ఈ హెల్తీ 5K రన్ పాల్గొన్న వారందరిలో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు డాక్టర్స్ డే వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తున్నాం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



మదనపల్లి, జూలై 1 (రాజనీతి ప్రతినిధి): ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ఈసీఐ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహణ జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (రాజూవఎఖుశ్రీ ×త్వఅంఱజవ =వజఅంఱశీఅ – ూ×=) కార్యక్రమం పురోగతిపై మంగళవారం భారత ఎన్నికల సంఘం (జజ×) సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ అధ్యక్షతన... రాష్ట్రంలోని జిల్లాల్లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం అమలు, పురోగతి, క్షేత్రస్థాయి చర్యలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవతో కలిసి జిల్లా ఎన్నికల అధికారు(ఱజూ)లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు మదనపల్లి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో చంద్రశేఖర్ రెడ్డి, ఆర్డీఓలు ఏ. శ్రీనివాస్, నారాయణ రెడ్డి, ఎస్‌డీసీ మాధవ కృష్ణారెడ్డి హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో చేపడుతున్న చర్యలు, క్షేత్రస్థాయి పురోగతి, నమోదు మరియు పరిశీలన కార్యక్రమాలపై జిల్లా వారీగా సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ సమీక్షించారు. ఓటరు జాబితాల ఖచ్చితత్వం, పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఇంటింటి స్థాయిలో పరిశీలన, అర్హులైన ప్రతి ఒక్కరి పేర్ల నమోదుకు చర్యలు తీసుకోవాలని, ఎలాంటి లోపాలు లేకుండా ఎన్నికల ప్రక్రియను నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లాలో 12,32,439 మంది ఓటర్లు ఉన్నారని, ఇప్పటివరకు 12,00,996 మంది ఓటర్లకు 97.38 శాతం మేర ఎలక్షన్ ఫార్మ్స్ పంపిణీ చేయడం జరిగిందన్నారు. మ్యాపింగ్, డిజిటలైజేషన్ ప్రక్రియలను వేగవంతం చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఓటరు జాబితాలో ఖచ్చితత్వం ఉండేలా, పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ, ఫారంల పంపిణీ, మ్యాపింగ్, డిజిటలైజేషన్ ప్రక్రియ తదితర అంశాలలో ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న తీరును కలెక్టర్ వివరించారు. ఈ వీసీలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

# డెంగ్యూ వ్యాధి పట్ల అవగాహన: నివారణే మార్గం

మదనపల్లి జూలై 1 (రాజనీతి ప్రతినిధి): నిల్వ ఉన్న స్వచ్ఛమైన నీటిలో పెరిగే 'ఏడిస్' (ూవవఎవం) దోమలు కుట్టడం వల్ల డెంగ్యూ అనే ప్రమాదకర వైరల్ జ్వరం వస్తుందని, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా దీనిని సులభంగా నివారించవచ్చని హెల్త్ అసిస్టెంట్ (నాూ.వీ) అంబరీష రాజు ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లా మదనపల్లిలో బుధవారం (01.07.2026) డెంగ్యూ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. డెంగ్యూ ప్రధాన లక్షణాలు: దోమ కుట్టిన 4 నుండి 10 రోజులలో ఆకస్మికంగా 104–105 డిగ్రీల వరకు అధిక జ్వరం రావడం.

తీవ్రమైన తలనొప్పి, కళ్ళ వెనుక నొప్పి, వాంతులు, వికారం మరియు శరీరంపై ఎర్రటి దద్దుర్లు రావడం.

కీళ్ళు, కండరాలలో భరించలేని నొప్పులు (ఎముకలు విరిగినట్లు అనిపించడం) మరియు రక్తంలో ప్లేట్‌లెట్లు పడిపోవడం.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు – చికిత్స:

నీటి నిల్వలు లేకుండా చూడాలి: కూలర్లు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, కుండీలలో స్వచ్ఛమైన నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.

దోమల నివారణ: నిద్రపోయేటప్పుడు దోమల తెరలు వాడాలి. శరీరాన్ని పూర్తిగా కప్పేలా చేతులు, కాళ్ళు కప్పే దుస్తులు ధరించాలి.

వైద్యం ు ఆహారం: జ్వరం రాగానే సొంత వైద్యం మానుకుని, వెంటనే డాక్టర్‌ను సంప్రదించి రక్త పరీక్షలు చేయించుకోవాలి. డెంగ్యూ సమయంలో శరీరం డీహైడ్రేషన్ బారిన పడకుండా కొబ్బరి నీరు, పండ్ల రసాలు, మంచి నీరు పుష్కలంగా తాగాలి. బొప్పాయి ఆకు రసం, కివీ పండు, దానిమ్మ తీసుకోవడం ద్వారా ప్లేట్‌లెట్ల సంఖ్యను వేగంగా పెంచుకోవచ్చని ఆయన సూచించారు.




Printed, Published & Owned by Smt.kakarla padmaja, Published at Do.No.3-267/5, Ragavendra Colony, Greemspeta, Chittoor Dist, Ap. and Printed at Prajasakthi Press, Renigunta road, Tirupati, Chittoor, A.P. Editor : N.Nagaraju, RNI No. APTEL/2013/49614